నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్



రాంగోపాల్‌పేట్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పిల్లి ప్రకాష్‌ను నియమిస్తూ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సంపత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పిల్లి ప్రకాష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషిని చేస్తానని హామీ ఇచ్చారు. ఎక్కడ మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగినా తమ సంస్థ ముందుండి పనిచేస్తుందని ప్రజలు కూడా రాజ్యాంగపరంగా లభించిన హక్కులు ఉల్లంఘలకు గురైతే తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. త్వరలోనే రాష్ట్ర అధ్యక్షుడు, కార్యవర్గంతో కలిసి తెలంగాణ మొత్తం తమ సంస్థ కార్యకలాపాలు ముమ్మరం చేసి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బస్సులో ఉచిత ప్రయాణం చేస్తున్న కోట నీలిమ

సనత్‌నగర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభ కార్యక్రమం శనివారం సనత్‌నగర్ బస్టాండ్‌లో అట్టహాసంగా జరిగింది. దీనికి హాజరైన కోట నీలిమ ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించి మహిళలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసమే సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నట్లు ప్రకటించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ద్వారా వారు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం కూడా ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కనుల పండువగా శ్రీనివాసుని కల్యాణం



చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న స్వామి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. పుష్పాలు, విద్యుత్‌దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి, భాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో కల్యాణోత్సవం జరిపించారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, బీఎస్ఆర్ గార్డెన్స్ అధినేత బిట్ల రఘునందన్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోరిక మేరకు ప్రతి నెల రెండో శనివారం స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్నామని, కార్తీకమాస చివరి రోజైన ఈ నెల 13వ తేదీ బుధవారం పోలిస్వర్గం (అరటిదొప్పల్లో దీపాలు పెట్టి నీళ్లలో వదలడం), 23వ తేదిన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నోముల ప్రకాశరావు తెలిపారు.

దివ్యాంగుల సంరక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి చంద్రశేఖర్‌రావు

రసూల్‌పురా: దివ్యాంగుల హక్కులు వాటి పరిరక్షణకు భారత ప్రభుత్వం దివ్యాంగుల హక్కుల చట్టం అమలులోకి తీసుకొచ్చిందని న్యాయ సహాయక సాధికారిక సంస్థ మెట్రోపాలిటన్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ.చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాలను పురస్కరించుకుని పద్మశ్రీ డాక్టర్ పి.హన్మంతరావు స్వీకార్ ఉప్‌కార్ రిహబిలిటేషన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి చంద్రశేఖర్ రావు హాజరై మాట్లాడారు. దివ్యాంగుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని స్వీకార్–ఉప్‌కార్ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కూల్ జెన్ ఫార్మ మేనేజింగ్ డైరెక్టర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆత్మనూన్యత భావనను విడనాడాలని ఎందరో దివ్యాంగులు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ రాజు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ ఎన్ఎస్, ఆర్. కృష్ణ, ప్రత్యేక పాఠశాల ఉపాధ్యాయులు కనకదుర్గ, జీవీ. గిరి, ఇతర ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగానికి వెళ్లిన యువకుడి అదృశ్యం



అడ్డగుట్ట: ఉద్యోగానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం.. తుకారాంగేట్‌కు చెందిన రోహిత్ (23) దీపిక దంపతులు. నాలుగు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇరువురి ఇంట్లో ఒప్పుకోకపోవడంతో తుకారాంగేట్‌లోని కేజీ హాస్పిటల్ సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. రోహిత్ రెయిన్‌బో హాస్పిటల్‌లో పని చేస్తుంటాడు. ఈ నెల 5న ఉద్యోగానికి వెళ్లిన రోహిత్ రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన దీపిక ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారు. బంధువులను వాకబు చేసినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రైలులో ఫుట్‌బోర్డింగ్

విద్యుత్ స్తంభం తగిలి బాలుడి మృతి

అడ్డగుట్ట: రైలులో ఫుట్ బోర్డింగ్ చేస్తున్న బాలుడికి విద్యుత్ స్తంభం తగలడంతో మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విద్యానగర్‌కు చెందిన జూలపల్లి బంటి (13) 8వ తరగతి చదువుతున్నాడు. శనివారం సెలవు ఉండటంతో స్నేహితుడితో కలిసి బల్కంపేట దేవాలయానికి వెళ్లేందుకు విద్యానగర్ రైల్వే స్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలెక్కాడు. రైలులో ఫుట్‌బోర్డింగ్ చేస్తున్న బంటికి జేమ్స్‌స్ట్రీట్–సంజీవయ్య పార్కు స్టేషన్ మధ్య పట్టాల పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి తల తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు రంగులు

అడ్డగుట్ట: పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకునే విధంగా ప్రయత్నిస్తున్నామని ఎంపీ. ఫౌండేషన్, ఇగ్నైట్ సంస్థ ప్రతినిధులు అన్నారు. శనివారం ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 'పేయింట్ ఏ స్కూల్' కార్యక్రమం నిర్వహించి తరగతి గదుల్లో రంగులు వేశారు. అనంతరం సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు.

ఉచిత ప్రయాణం..

అతివల మహదానందం

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఎంతో ఉపయోగపడుతుందని ఉత్తర మండలం డీసీపీ చందన దీప్తి అన్నారు. సికింద్రాబాద్ బ్లూసీ హోటల్ ప్రాంతంలో కంటోన్మెంట్ డిపో ఆధ్వర్యంలో మహాలక్ష్మి మహిళల ఉచిత ప్రయాణం పథకాన్ని రూట్ నంబర్ 16–ఏ (సికింద్రాబాద్ నుంచి ఈసీఐఎల్ చౌరస్తా) బస్సును శనివారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ డిపో మేనేజర్ రామ్మోహన్, సీఐ శ్రీపతి కృష్ణ, ఎంఎఫ్ బాలరాజ్, అదనపు డీసీపీ మధుసూదన్, ఏసీపీ సుధీర్, ఇన్‌స్పెక్టర్ మురళీధర్ పాల్గొన్నారు.

– సనత్‌నగర్/రాంగోపాల్‌పేట్/కంటోన్మెంట్



తొలి బస్సును ప్రారంభిస్తున్న నార్త్ జోన్ డీసీపీ చందనా దీప్తి



గాంధీ ఆస్పత్రిలో ప్రారంభిస్తున్న ఉచిత ప్రయాణ బస్సును ఎక్కుతున్న మహిళలు

నిరంతర ప్రక్రియ ఉంటే బాగుంటుంది..



బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని ఇళ్లలో వంట పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ప్రతి రోజు నేరేడ్‌మెట్ నుంచి ప్రకాశ్‌నగర్‌కు వచ్చి వెళ్తుంటాను. అక్కడి నుంచి ఇక్కడికి వచ్చేందుకు రూ.1330 పెట్టి బస్ పాస్ తీసుకున్నాను. ఇప్పుడు మహిళలందరికి బస్సులో ఉచిత ప్రయాణంతో నెలకు రూ.1330 మిగులుతోంది. ఇది ఎన్నాళ్లుంటుందో ఏమో అని భయమేస్తుంది. ఇది ఇలాగే కొనసాగితే నాలాంటి వాళ్లకు చాలా ఉపయోగంగా ఉంటుంది. ఏదిఏమైనా కాంగ్రెస్ పార్టీ మంచి పని చేసింది.

– ఇందిర, నేరేడ్‌మెట్

విద్యార్థినులకు భారం తగ్గుతోంది..



కీసర నుంచి ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కాలేజీకు వస్తాను. రూ.500 పెట్టి స్టుడెంట్ బస్ పాస్‌తో వస్తాను. బస్‌పాస్‌కు పెట్టే పైసలు ఇప్పుడు ప్యాకెట్ మనీకి వస్తాయి. ఇంకా చాలా మంది స్టూడెంట్స్ కాలేజ్ బస్సుల్లో నెలకు రెండు వేల నుంచి మూడు వేల రూపాయలు వెచ్చించి వెళ్తున్నారు. వారందరికి ఇది ఎంతో ఉపయోగం. కానీ మహిలు, విద్యార్థినుల కోసం బస్సుల సంఖ్యను పెంచాలి. లేకుంటే రద్దీతో మరింత గందరగోళ పరిస్థితి ఏర్పడుతోంది.

– సౌమ్య విద్యార్థిని, కీసర

చార్జీల భారం తగ్గింది..



నేను ప్రగతినగర్ నుంచి సనత్‌నగర్‌కు వస్తుంటాను. ఇక్కడి విజయకృష్ణా నర్సింగ్ హోమ్‌లో పని చేస్తుంటాను. అయితే తాను వచ్చే క్రమంలో ఒక్కోసారి మూడు బస్సులు మారాల్సి వస్తోంది. దీంతో రోజుకు రూ.100ల వరకు చార్జీలకే అవుతుంటాయి. పాస్ తీసుకున్నా వెయ్యి రూపాయల పైనే. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం,ఛార్జీల భారం లేకపోవడంతో ఆనందంగా ఉంది.

– కుమారి సిస్టర్, ప్రగతినగర్

ఆర్థికంగా మేలు చేకూరుతుంది..



ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ఆనందంగా ఉంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఛార్జీలు లేకుండా ప్రయాణం చేయడంతో మహిళలకు ఆర్థికంగా ఎంతో మేలు చేకూరుతుంది. ఎలాంటి ఛార్జీలు లేకుండా తెలంగాణలో ఎక్కడికైనా ప్రయాణం చేసే వెసులుబాటు కల్పించడం ఆనందంగా ఉంది.

– సవిత, సనత్‌నగర్

శుభపరిణామం



పేద, మధ్యతరగతి వర్గాల వారు కుటుంబ ఖర్చుల గురించి ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. ఉద్యోగం, ఊరికి వెళ్లాలనా, ఇతరత్రా పనులపై వేరే ప్రాంతానికి వెళ్లాలన్నా బస్సులను ఆశ్రయించాల్సిందే. ఈ క్రమంలో ఛార్జీల భారంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తేవి. ప్రభుత్వం మహిళలు, బాలికల గురించి ఆలోచించి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం శుభపరిణామం.

– నారాయణమ్మ, సనత్‌నగర్

ఎంతో సంతోషంగా ఉంది..



కాంగ్రెస్ ప్రభుత్వం సోనియా జన్మదినాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించినందుకు ధన్యవాదాలు. నిరుపేదల మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది.

– జయప్రద, పికెట్

ప్రభుత్వానికి ధన్యవాదాలు..



ఉద్యోగం చేసుకునే మహిళలకు ప్రయాణ ఖర్చుల భారం తగ్గుతుంది. దీంతో చిన్నపాటి ఉద్యోగాలు చేసుకునే మహిళలు ఇకపై దూర భారాన్ని పట్టించుకోకుండా ప్రయాణించే అవకాశం ఉంటుంది. ప్రయాణ ఖర్చుల భారంతోనే ఉపాధి అవకాశాలు వదులుకునే మహిళలకు ఎంతో చేయూతనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– అమృత, మడ్‌ఫోర్ట్

'మహాలక్ష్మి'తో మహిళల సందడి



మహాలక్ష్మి ఉచిత బస్సు వద్ద ఫొటో దిగుతున్న గాంధీ సెక్యూరిటీ సిబ్బంది

గాంధీఆస్పత్రి : సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు స్వాగతించారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో ఆరోగ్యశ్రీ వైద్యఖర్చుల కేటాయింపు రూ. 5 నుంచి 10 లక్షలకు పెంచే 'చేయూత', మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 'మహాలక్ష్మి' గ్యారంటీ పథకాలను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ప్రారంభించారు. గాంధీఆస్పత్రిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే మహిళలు పెద్దసంఖ్యలో హాజరై పుష్పాలతో అలంకరించిన ఆర్టీసీ బస్సుల వద్ద సెల్ఫీలు దిగి సందడి చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్, గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, పోస్టర్‌ను ఆవిష్కరించారు. గాంధీ ఆస్పత్రిలో వివిధ కేటగిరీలలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతి సుమారు నాలుగు వేల మంది మహిళలు మూడు షిఫ్టులో విధులు నిర్వహిస్తారని, వారికి ఉచిత ప్రయాణంతో లబ్ధి చేకూరుతుందని ఆస్పత్రి అధికారులు తెలిపారు.

ఒంటరి మహిళలకు రూ. 5 వేల పింఛన్ ఇవ్వాలి

లాలాపేట: వితంతువులకే కాకుండా భర్త నుంచి విడిపోయి ఒంటరిగా ఉంటున్న మహిళలకు రూ. 5 వేల పింఛన్ ఇవ్వాలని గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ సెక్రటరీ డాక్టర్ రుక్మిణి రావు డిమాండ్ చేశారు. శనివారం తార్నాకలో యాక్షన్ ఎయిడ్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కన్వెన్షన్ ఆన్ సింగిల్ ఉమెన్ సదస్సు జరిగింది. దీనికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 8 స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, ఒంటరి మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో పలు విధాలుగా వివక్షకు గురవుతున్న ఒంటరి మహిళలకు ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. వారి వారి విద్యార్హతలను బట్టి ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఒంటరి మహిళా సమస్యలు, హక్కులను తెలిపే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ డా. సుభాషిణి, ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఇర్ఫాన్, వందన, కోఆర్డినేటర్స్ సుమలత, సుమతి, మమత పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి రిమాండ్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

అడ్డగుట్ట: రైల్వే ప్రయాణికులను టార్గెట్ చేసి వారి బ్యాగుల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు కొంత కాలంగా రైల్వే స్టేషన్లలో ప్రయాణికులను టార్గెట్ చేసుకొని బ్యాగుల చోరీలకు పాల్పడుతుండేవారు. ఈ క్రమంలో ప్రయాణికుల నుంచి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో అప్రమత్తమైన ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. శుక్రవారం స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 20 తులాల బంగారం స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

అక్రమ పార్కింగ్‌కు చెక్



జామై ఉస్మానియా రోడ్డు పక్కనే వాహనాలన పార్కింగ్ (నాడు)



వాహనాలను తొలగించిన ట్రాఫిక్ ఎస్ఐ కరుణాకర్ (నేడు)

సాక్షి ఎఫెక్ట్..

బౌద్ధనగర్: ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా అక్రమ పార్కింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని చిలకలగూడ ట్రాఫిక్ ఎస్సై కరుణాకర్ హెచ్చరించారు. జామై ఉస్మానియా వద్ద రోడ్లపై నిలుపుతున్న వాహనాలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి.ఈ సమస్యపై 'అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకోండి' అనే శీర్షికతో శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. రోజుల తరబడి రోడ్డు పక్కనే పార్కింగ్ చేసిన పలు వాహనాలను తరలించి సమస్యను పరిష్కరించారు.

పార్లమెంట్ ఎన్నికల్లోనూ తెలంగాణ ఫలితాలు



ఓయూలో కేక్‌కట్ చేస్తున్న ఉదయ్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లోనూ తెలంగాణ ఫలితాలు పునరావృతం అవుతాయని టీపీసీసీ రాష్ట్ర మాజీ జాయింట్ సెక్రెటరీ ఏగూరి ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం ఓయూ విద్యార్థి జేఏసీ, టీఎస్ జాక్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన కాంగ్రెస్ నేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలకు ఉదయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల పోరాటాలు, ఆత్మబలిదానాలకు చలించిన సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చిందన్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటుతో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తిరిగి అధికారంలోకి రావడం జాతీయ స్థాయిలో కూడా అధికారంలోకి రావడానికి సంకేతమన్నారు. ఇష్టారాజ్యాంగ దేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీని సైతం రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గద్దె దింపడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర నాయకులు శివరాత్రి, ప్రశాంత్, ఎం.లింగస్వామి, గడ్డం శ్రీనివాస్, డాన్ శ్రీనివాస్‌గౌడ్, నరేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలు

సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం: సోనియా గాంధీ పుట్టిన రోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లోని ఆ పార్టీ నాయకులు ఆయా కూడళ్లలో కేక్‌లు కట్‌చేసి సంబురాలు చేసుకున్నారు.

- మాణికేశ్వర్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు వరికుప్పల రవి, వేముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.
- తుకారాంగేట్ రియో పాయింట్ హోటల్ వద్ద ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడు ఆదం సృజన్ నేతృత్వంలో జరిగిన వేడుకల్లో ఆదం సంతోష్ పాల్గొని కేక్ కట్ చేశారు.
- చిలకలగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు.
- సీతాఫల్‌మండి అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆదం సంతోష్‌కుమార్ నేతృత్వంలో, సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్ అధ్యక్షులు బండి అభిషేక్ ముదిరాజ్, రవిచంద్ర కుమార్ నేతృత్వంలో మెట్టుగూడలో సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలను సందడిగా నిర్వహించారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు సాయిబాబా

- ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట వివిధ విద్యార్థి సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, జేఏసీ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సోనియాగాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి నేత రహీం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌కట్ చేసి మాట్లాడారు.
- ఓయూలో కాంగ్రెస్ పార్టీ నేత మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె.సత్యనారాయణ కేక్‌కట్ చేశారు.



మెట్టుగూడలో..

- ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ కేక్‌కట్ చేసి విద్యార్థులకు పంపిపెట్టారు.
- సనత్‌నగర్ నెహ్రూ పార్కు వద్ద సీనియర్ నేత నరేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. అలాగే స్వామి టాకీస్ వద్ద రాపోలు ఎలీషా ఆధ్వర్యంలో, బస్టాండ్ వద్ద అడ్డూ, అతీఖ్‌ల ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేసి అన్నదాన కార్యక్రమాలు జరిపారు.
- బేగంపేట డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని డాన్ బడ్స్ స్కూల్‌లో సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత హోసిటోచర్ ఆధ్వర్యంలో చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు.



కేక్ తినిపిస్తున్న పిడమర్తి రవి



చిన్నారుల మధ్య కేక్ కట్ చేస్తున్న హోసిటోచర్



వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి అమర్‌నాథ్‌గౌడ్

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడిపూజ

చిలకలగూడ: నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గురుస్వామి గడ్డం అశోక్ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప మహాపడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, సాయిబాబా సమేత బాలాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ నాగులూరి సాయిబాబా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరితగతిన కోలుకోవాలని కార్పొరేటర్ హేమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులకు గత 17 ఏళ్లుగా అన్నదానం చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నైవేద్యం సాయికుమార్, కరాటే రాజు, సాయి కిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న హేమ, సాయిబాబా